సాక్షి
కృష్ణాజిల్లా

బుధవారం । 1 । మార్చి । 2023



నిత్యాన్నదానానికి విరాళం
ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి తాడిగడప విద్యానగర్ కాలనీకి చెందిన కొత్తపల్లి విజయలక్ష్మి రూ. 1,00,001 విరాళాన్ని అందజేశారు.



ఈవీఎం గోదాము పరిశీలన
చిలకలపూడి: కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ పి.రంజిత్‌బాషా మంగళవారం పరిశీలించారు. డీఆర్వో వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా కబడ్డీ పోటీలు
జగ్గయ్యపేటలో జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. బుధవారం సెమీస్, ఫైనల్స్ నిర్వహించనున్నారు.

-8లో

న్యూస్‌రీల్

'ఫ్యామిలీ డాక్టర్' కచ్చితంగా అమలవ్వాలి



చిలకలపూడి(మచిలీపట్నం): ఇక నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. ఆమె తన కార్యాలయంలో ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. గీతాబాయి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా రూబెల్లా ఎలిమినేషన్ కార్యక్రమాన్ని డిసెంబర్ 2023 నాటికి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అర్హులైన పిల్లలకు 9 నుంచి 12 నెలల మధ్యవారికి ఎంఆర్–1, 16 నుంచి 24 నెలల మధ్య వయసు ఉన్న వారికి ఎంఆర్ -2 వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల్లో ఉన్న రక్తహీనత స్థాయిని గుర్తించి వారి హిమోగ్లోబిన్ శాతాన్ని బట్టి ఐరన్ మాత్రలు, సుక్రోజ్ ఇంజెక్షన్లను అందజేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. శర్మిష్ట, డీఐవో ఎ. వెంకట్రావు, డీటీసీ రత్నగిరి, నోడల్ ఆఫీసర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలు ప్రారంభం



విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి 42వ సీనియర్ మహిళలు, పురుషుల ఆర్చరీ పోటీలు విజయవాడలోని శాతవాహన కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి 13 జిల్లాల నుంచి 40 మంది పురుషులు, 30 మంది మహిళలు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ ఎన్.రమాసత్యనారాయణ ఈ పోటీలను ప్రారంభించారు. తొలి రోజు ఇండియన్ రౌండ్ విభాగంలో క్రీడాకారులు తలపడ్డారు. బుధవారం కాంపౌండ్, గురువారం రికర్వ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు.

కుక్కల సమస్యల నివారణకు టోల్ ఫ్రీ నంబర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీధి కుక్కల నియంత్రణపై తగిన చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో సుమారు 30 వేల వీధి కుక్కలు ఉన్నాయని, వీటిని పట్టుకుని వ్యాక్సిన్లు వేయటానికి, యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ)కి మూడు ప్రత్యేక వాహనాలు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. నగరంలోని 64 డివిజన్లలో ఉన్న అన్ని వీధి కుక్కలకు ఆరు నెలల్లో రేబిస్ టీకాలు చేస్తామని తెలిపారు. ఈ మేరకు వీఎంసీ ఆధ్వర్యంలో నగరంలోని 286 సచివాలయాల పరిధిలో డాగ్ లవర్స్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. వీధి కుక్కల సమస్యలకు వీఎంసీ టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2000, వీఎంసీ వాట్సాప్ నంబర్ 81819 60909ను సంప్రదించాలని సూచించారు.

వాలీబాల్ రన్నరప్ కృష్ణాజిల్లా



చీపురుపల్లి: విజయనగరం జిల్లా చీపురుపల్లి పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఆహ్వానపు టోర్నమెంట్ విజేతగా యానాం జట్టు, ద్వితీయ స్థానంలో కృష్ణా జిల్లా జట్టు నిలిచాయి. కనకమహాలక్ష్మి అమ్మవారి 25వ జాతర మహోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో గత నెల 26న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఆహ్వానపు టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, యానాం నుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో యానాం, కృష్ణా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. రెండు జట్ల మధ్య సోమవారం రాత్రి హోరాహోరీగా సాగిన తుదిపోరులో కృష్ణా జిల్లా జట్టుపై యానాం జట్టు విజయం సాధించింది. దీంతో యానాం జట్టుకు రూ.30 వేల నగదు బహుమతితో బాటు ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జిల్లా జట్టుకు రూ.25 వేల నగదుతో బాటు ట్రోఫీని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అందజేశారు.

సర్వజన ఆరోగ్యం పదిలం

- మెరుగైన వైద్య సదుపాయాలు
- అందుబాటులో సీటీస్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, రక్తపరీక్షల పరికరాలు
- పెరిగిన వైద్యులు, సిబ్బంది
- రోగులకు సత్వర సేవలు

సర్వజన ఆస్పత్రిగా బందరు వైద్యశాల రూపాంతరం



మచిలీపట్నంలోని సర్వజన ఆస్పత్రి ముఖద్వారం

మచిలీపట్నం టౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. మెడికల్ కళాశాల ఏర్పాటుతో జిల్లా ప్రభుత్వాస్పత్రి సర్వజన ఆస్పత్రిగా రూపాంతరం చెందింది. ఈ ఆస్పత్రిని మెడికల్ కళాశాలకు అనుబంధంగా నిర్వహిస్తున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పర్యవేక్షణలో ఉన్న ఈ ఆస్పత్రి ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ పర్యవేక్షణలోకి వెళ్లింది. దీంతో వైద్యులు, సిబ్బంది నియామకాలు సర్వజన ఆసుపత్రి విధానంలో నియమించారు. గతంలో కన్నా ప్రస్తుతం సిబ్బంది, వైద్యుల సంఖ్య పెరిగింది. ఫలితంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), ఇతర ప్రజాప్రతినిధుల కృషితో మచిలీపట్నంకు మెడికల్ కళాశాలను తీసుకువచ్చారు. మెడికల్ కళాశాల పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది దాదాపు 150 ఎంబీబీఎస్ విద్యార్థులతో సర్వజన ఆస్పత్రిలో తరగతులు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో ఆస్పత్రిలో నియమితులైన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెడికల్ విద్యార్థులకు బోధనతో పాటు రోగులకు చికిత్సలు చేయనున్నారు.



వార్డులో ఏర్పాటు చేసిన బెడ్లు

అధునాతన పరికరాలు..
ఆస్పత్రిలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించేందుకు అధునాతన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. సీటీస్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, రక్తపరీక్షల అధునాతన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ పరికరాలతో రోగులకు పరీక్షలు నిర్వహిస్తుండంతో వ్యాధి నిర్ధారణ సక్రమంగా జరిగి వారికి మెరుగైన చికిత్సలు అందేందుకు వీలు కలుగుతోంది.

పెరిగిన వైద్యులు, సిబ్బంది..
జిల్లా ఆస్పత్రి సర్వజన ఆస్పత్రిగా మారిన అనంతరం వైద్యులు, సిబ్బంది పోస్టులు పెరిగాయి. గతంలో సివిల్ సర్జన్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, డెప్యూటీ సివిల్ సర్జన్లు, ఎంబీబీఎస్ వైద్యులు ఉండేవారు. ప్రస్తుతం ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డెప్యూటీ ప్రొఫెసర్లు 42 మందిని కేటాయించగా వీరిలో ప్రస్తుతం 25 మందివైద్యులు విధుల్లో చేరారు. మరో 17 మంది విధుల్లో చేరాల్సి ఉంది. స్టాఫ్ నర్సులు గతంలో 100 మంది ఉండగా ప్రస్తుతం 130 మంది పనిచేస్తున్నారు. మరో 70 మంది విధుల్లో చేరనున్నారు. గతం 10 మంది ఉండగా ప్రస్తుతం 16 మంది ల్యాబ్ టెక్నీషియన్లను నియమించారు. జనరల్ డ్యూటీ సిబ్బంది గతంలో 30 మంది కాగా ప్రస్తుతం 75 మందిని నియమించారు. ఇలా అన్ని విభాగాల్లోనూ వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరిగింది.

రోగులకు మెరుగైన సేవలే లక్ష్యం..



సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. వైద్యులు, సిబ్బంది రోగులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తారు. రోగులకు పలు రకాల పరీక్షలు నిర్వహించేందుకు అధునాతన పరికరాలు ఒనగూరాయి. ఫలితంగా రోగులకు మంచి వైద్యం అందుతోంది.

– కోలా రామచంద్రరావు, ఆర్‌ఎంవో

పేదలకు నాణ్యమైన వైద్యం..



స్థానిక ఎమ్మెల్యే కృషితో మచిలీపట్నంకు మెడికల్ కళాశాల వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కళాశాల మంజూరు చేయడంతో ఆస్పత్రిని అధునాతన హంగులతో అభివృద్ధి చేశారు. దాదాపు రూ. 2 కోట్లు వెచ్చించి పలు సదుపాయాలు, పరికరాలను ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు మంచి వైద్యం అందేలా అభివృద్ధి కమిటీ పనిచేస్తోంది.

– చీలి రవీంద్ర, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు

సంతోషాలు వేవేలు

- కృష్ణా జిల్లాలో రూ.194.96 కోట్లతో 2,404 సీసీ రోడ్లు నిర్మించాలని నిర్ణయం
- ఇప్పటికే 870 రోడ్ల నిర్మాణ పనులు పూర్తి
- 50 శాతానికి పైగా పూర్తయిన 623 పనులు చేపట్టేందుకు చర్యలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ప్రయాణాలు ఇక సజావుగా సాగనున్నాయి. రెండు జిల్లాల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తోంది. తొలుత ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం ప్రతి పంచాయతీలోనూ సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణ పనులు చేపట్టింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణ పనులపై దృష్టి సారించింది.

కృష్ణా జిల్లాలో ఇలా..

కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లో రూ.194.96 కోట్ల అంచనాలతో మొత్తం 2,404 రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే 870 రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసింది. 50 శాతానికి పైగా పనులు జరిగి అసంపూర్తిగా మిగిలిన రోడ్ల నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో 623 రోడ్ల నిర్మాణానికి రూ.54.24 కోట్లతో అంచనాలు రూపొందించింది. ఈ పనుల్లోనూ ఇప్పటికే రూ.39.59 కోట్ల మేర పూర్తయ్యాయి. వీటికి సంబంధించి రూ.38.10 కోట్ల బిల్లులను సైతం చెల్లించింది. మిగిలిన రూ.14.65 కోట్ల పనులను పూర్తిచేసేందుకు అనుమతి ఇచ్చింది. వీటిని దశల వారీగా చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



మచిలీపట్నం మండలం గోకవరం గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

ఎన్టీఆర్ జిల్లాలో ఇలా..

ఎన్టీఆర్ జిల్లాలో గతంలో మొత్తం 1,008 రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి రూ.117.46 కోట్లతో ప్రభుత్వం అంచనాలు రూపొందించింది. మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల్లోని 16 మండలాల్లో ఇప్పటికే 50 శాతానికి పైగా నిర్మాణం జరిగి అసంపూర్తిగా ఉన్న పనులు 739 ఉన్నాయి. వీటి అంచనా విలువ రూ.76.46 కోట్లు. ఇప్పటికే రూ.40.11 కోట్ల మేర పనులు జరిగాయి. రూ.37.44 కోట్ల బిల్లులు సైతం చెల్లించారు.

కృష్ణా జిల్లాలో

నియోజకవర్గం	పనుల సంఖ్య	అంచనా విలువ (రూ. కోట్లల్లో)	పని విలువ (రూ. కోట్లల్లో)
అవనిగడ్డ	31	1.94	1.32
గన్నవరం	28	5.10	3.88
గుడివాడ	149	8.04	5.78
మచిలీపట్నం	140	13.39	9.85
పామర్రు	64	4.11	3.19
పెడన	161	9.87	7.54
పెనమలూరు	50	11.79	8.03
మొత్తం	623	54.24	39.59

రోడ్ల పనులకు ప్రాధాన్యం
గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. గతంలోనే మంజూరై, 50 శాతానికి పైగా పూర్తయ్యి, అసంపూర్తిగా మిగిలిన రోడ్ల నిర్మాణాన్ని ప్రస్తుతం చేపడుతున్నాం. ఈ పనులను ఇప్పటికే గుర్తించాం. జిల్లా వ్యాప్తంగా 623 రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం.

– పి.రంజిత్‌బాషా, కృష్ణా జిల్లా కలెక్టర్

జన జాతరకు వేళాయె

మార్చి 7 నుంచి పెనుగంచిప్రోలు తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల ఆరాధ్య దైవమైన పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాలు మార్చి ఏడు నుంచి 11వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలకు ఆలయ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కొక్క రోజు ఒక్కో ప్రత్యేకతతో ఐదు రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి పసుపు, కుంకుమ బండ్ల రాక తిరునాళ్లలో ప్రధాన ఘట్టంగా నిలుస్తుంది. తిరునాళ్లకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలి వస్తారు. ఆలయ అధికారులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మునేరులో జల్లు స్నానాలు, పలు చోట్ల చేతి పంపులు, షామియానాలు ఏర్పాటుచేశారు.

- **అఖండ జ్యోతి స్థాపన**

మార్చి ఏడో తేదీ ఉదయం 5.59 గంటలకు అఖండజ్యోతి స్థాపనతో చిన్న తిరునాళ్లు మొదలవుతాయి. వేలాదిగా భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో మొక్కులు తీర్చుకుంటారు.

- **గ్రామోత్సవం**

తిరునాళ్లలో రెండో రోజైన మార్చి ఎనిమిదో తేదీ రాత్రి 6.01 గంటలకు తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఉత్సవ మూర్తులను రథంపై ప్రతిష్ఠించి గ్రామంలో రథోత్సవం (గ్రామోత్సవం) నిర్వహిస్తారు.

- **పసుపు, కుంకుమ బండ్లు**

చిన్న తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన అమ్మవారి పుట్టింటి పసుపు–కుంకుమ బండ్లు మార్చి తొమ్మిదో తేదీన అనిగండ్లపాడు గ్రామం నుంచి సాయంత్రం 6.04 గంటలకు బయలుదేరి వస్తాయి. అమ్మవారి పుట్టింటి వంశీకులు కొల్లా శ్రీనివాసరావు ఇంటి నుంచి ఏటా పసుపు, కుంకుమను బండ్లపై తీసుకు రావటం ఆనవాయితీగా వస్తోంది. గ్రామానికి చెందిన వారు వందల బండ్లతో పసుపు, కుంకుమ బండి వెంట పెనుగంచిప్రోలు ఆలయానికి చేరుకుంటారు.



శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు

- **దివ్య ప్రభోత్సవం**

నాల్గో రోజైన మార్చి పదో తేదీ రాత్రి 8.26 గంటలకు దివ్య ప్రభోత్సవం వైభవంగా జరగనుంది. 90 అడుగుల ఎత్తయిన దివ్యప్రభపై ఉత్సవమూర్తులను ఉంచి ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయిస్తారు.

- **బోనాల సమర్పణ**

మార్చి 11వ తేదీన భక్తుల బోనాల సమర్పణతో చిన్న తిరునాళ్ల ఉత్సవాలు ముగుస్తాయి.

భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి
చిన్న తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం పక్కా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రత్యేకంగా క్యూలైన్లు, బారికేడ్లు, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాట్లు ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో చేస్తున్నాం. మునేరులో జల్లు స్నానాలు, తలనీలాలు తీసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్సవాలు జరిగే ఐదు రోజులూ ఆలయం వద్ద రాత్రి సమయంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

– జి.వి.డి.ఎస్.లీలాకుమార్, ఆలయ ఈఓ

ఆర్థిక అండ.. సాగు పండగ

రైతు చేతికి పెట్టుబడి సాయం

- కృష్ణా జిల్లాలో 1,51,500 మందికి రూ. 32.93 కోట్ల పంపిణీ
- మరో 3445 మందికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ. 2.49 కోట్లు అందజేత
- జిల్లాస్థాయి కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్, కలెక్టర్

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సహాయం, ఇన్‌పుట్ సబ్సిడీలను అందిస్తూ వారిని అన్ని వేళలా ఆదుకుంటోందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో వైఎస్సార్ రైతుభరోసా మూడో విడత వైఎస్సార్ రైతుభరోసా – పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాల ద్వారా లబ్ధిని నేరుగా రైతుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో వీక్షించిన అనంతరం చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

జిల్లాలో లబ్ధి ఇలా..

కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,51,500 మంది రైతుల కుటుంబాలకు రూ. 32.93 కోట్లు అందజేశామన్నారు. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ సాయంతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం సొంత భూమి కలిగిన రైతులతో పాటు కౌలుదారులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ. 13,500 అందిస్తోందన్నారు. మే నెలలో మొదటి విడతగా రూ. 7,500, అక్టోబర్ నెలలో రెండో విడతగా రూ. 4వేలు, నేడు మూడో విడతగా రూ. 2 వేలు జమ చేశాన్నారు.



రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తదితరులు

నష్టపరిహారం కూడా సమయానికే..

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగే రైతులకు అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తోందని కలెక్టర్ అన్నారు. జిల్లాలో గత నెలలో సంభవించిన మాండూస్ తుపాను కారణంగా 1664 హెక్టార్లలో వరి పంటను నష్టపోయిన 3,445 మంది రైతులకు రూ. 2.49 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతు భరోసా నగదు, ఇన్‌పుట్ సబ్సిడీతో పంటసాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర వ్యవసాయ ఖర్చులకు ఉపయోగించుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

ఇప్పటి వరకూ లబ్ధి ఇలా..

వైఎస్సార్ రైతుభరోసా పథకం, పీఎం కిసాన్ ద్వారా 2019–20లో 1,44,234 మంది రైతులకు రూ. 11.98 కోట్లు, 2020–21లో 1,50,487 మంది రైతులకు రూ. 116.97కోట్లు, 2021–22లో 1,43,707 మంది రైతులకు రూ. 111.40కోట్లు, 2022–23లో మొదటి విడతగా 1,40,165 మంది రైతులకు రూ. 77.09 కోట్లు, రెండో విడతగా 1,50,213 మంది రైతులకు రూ. 67.98 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందించిందన్నారు.

రైతు బాగుంటేనే..

జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను సంతోషంగా ఉంచేలా సంక్షేమ ఫలాలను నేరుగా అందిస్తున్నారన్నారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు ప్రదర్శనలో ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ జన్ను రాఘవరావు, సభ్యులు శ్రీకాకోళపు నాగేశ్వరరావు, పట్టపు శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మనోహరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్. శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి చంద్రశేఖరరావు, మచిలీపట్నం వ్యవసాయ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్త ఎం. గిరిజారాణి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఉచితంగా గ్రహణంమొర్రి ఆపరేషన్లు

- ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహణ
- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రహణం మొర్రితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసేందుకు ఈ నెల రెండు నుంచి ఐదో తేదీ వరకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నామని విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి తెలిపారు. మిషన్ స్మైల్, ముత్తూట్ ఫౌండేషన్‌తో కలిసి ప్రభుత్వాస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వివరాలను డాక్టర్ సౌభాగ్యలక్ష్మి మంగళవారం విలేకరులకు వెల్లడించారు. ఈ నెల రెండో తేదీన స్క్రీనింగ్ పరీక్షలు, రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. మూడు, నాలుగు, ఐదు తేదీల్లో శస్త్ర చికిత్సలు చేస్తామని పేర్కొన్నారు. ఈ మూడు రోజుల్లో 50 నుంచి 70 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వివరించారు. ఈ శిబిరానికి వచ్చే చిన్నారులకు మిషన్ స్మైల్ ఆధ్వర్యంలో రవాణా చార్జీలు కూడా చెల్లిస్తామన్నారు. సమీపంలోని గ్రామాల వారిని తమ వాహనాల్లోనే ఆపరేషన్ల అనంతరం ఇళ్లకు పంపిస్తామన్నారు. గ్రహణం, అంగిలి చీలిక వంటి వాటికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వాస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎ.ఆర్.సీహెచ్.మోహన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ నాలుగు సార్లు మిషన్ స్మైల్‌తో కలిసి ఉచితంగా గ్రహణంమొర్రి శస్త్ర చికిత్సలు చేశామన్నారు. ఈ శిబిరం ఐదోదని తెలిపారు. మరిన్ని వివరాలకు 96746 59679, 63033 58564 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యు.శోభ, ముత్తూట్ ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ సుబ్బారావు, మిషన్ స్మైల్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ సమీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, డాక్టర్ మోహన్ తదితరులు

పరిశ్రమల ఏర్పాటుకు యువతను ప్రోత్సహించాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించటంతో పాటు మెండుగా ఉపాధి అవకాశాలు కల్పించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం డిస్ట్రిక్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం గురించి సమగ్రమైన అవగాహన కల్పించాలన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా చదువుకున్న యువతను గుర్తించి గ్రూపులుగా చేసి వారికి ఆసక్తి గల రంగాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను కూడా తెలియజేయాలన్నారు. పీఎంఈజీపీ పథకం ద్వారా జిల్లాలో రూ. 4.51 కోట్లతో 104 యూనిట్లను స్థాపన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు 88 యూనిట్లు మంజూరు చేసినట్లు, రూ. 2.46 కోట్లు సబ్సిడీగా ఇస్తున్నామన్నారు. సింగిల్ విండో ద్వారా పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అనుమతులు వేగంగా ఇస్తున్నామన్నారు. పరిశ్రమలకు 30 యూనిట్ల వరకు విద్యుత్ రాయితీ, వడ్డీ రాయితీ, పెట్టుబడి రాయితీ, అమ్మకపు పన్ను రాయితీ మొత్తం రూ. 1.88 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖాధికారి ఆర్. వెంకట్రావు, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గొరిపర్తి వరలక్ష్మీ, ఎల్‌డీఎం సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

● చిలకలపూడి(మచిలీపట్నం): గిరిజనుల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఎం. ఫణిదూర్జటి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు 2022–23 సంవత్సరానికి ఈ పథకం కోసం కొత్తగా ప్రతిపాదనలు ఉంటే www.ngo.tribal.gov.in పోర్టల్‌లో ఈ నెల 12వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9502082159లో సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

జగ్గయ్యపేట అర్బన్: సామినేని వెంకట మల్లిఖార్జున ప్రసాద్(ఎస్‌వీఎం ప్రసాద్) మెమోరియల్ రాష్ట్ర స్థాయి మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల ప్రాంగణంలో రెండో రోజు పోటీల్లో జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకూ ఫ్లడ్ లైట్ల వెలుగులో మొత్తం తొమ్మిది లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. వీటిల్లో కృష్ణా, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లా జట్లు గెలిచి సెమీస్ చేరాయి. బుధవారం ఈ పోటీలకు సంబంధించిన సెమీస్, ఫైనల్స్ జరగనున్నాయి. అనంతరం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా హాజరై, విజేతకు ట్రోఫీ అందజేస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రకటించారు.

యువ వైద్యులకు ఆదర్శం డాక్టర్ విఠల్‌రావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నేటితరం యువ వైద్యులకు డాక్టర్ విఠల్‌రావు ఆదర్శంగా నిలిచారని పలువురు వైద్యులు కొనియాడారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ మంగళవారం పదవీ విరమణ చేసిన డాక్టర్ సత్తా శ్రీనివాస విఠల్‌రావును పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు ప్రభుత్వ వైద్యునిగా కొనసాగిన డాక్టర్ విఠల్‌రావు వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేశారన్నారు. సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా 8 నెలల పాటే పనిచేసినప్పటికీ తనదైన ముద్ర వేశారన్నారు. వైద్య కళాశాలకు 70కి పైగా పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్లు తీసుకురావడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావును అభినందించిన వారిలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. సౌభాగ్యలక్ష్మి, ఆర్‌ఎంఓ డాక్టర్ యు. శోభ, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ కె. అప్పారావు, ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ రవి, గవర్నమెంట్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.



డాక్టర్ విఠల్‌రావును సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

కొత్త ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుధాకర్



సిద్ధార్థ వైద్య కళాశాల కొత్త ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కంచర్ల సుధాకర్ నియమితులయ్యారు. ప్రస్తుతం గుంటూరు వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతిగా పనిచేస్తున్న ఆయనను పూర్తి అదనపు బాధ్యతలతో(ఎఫ్‌ఏసీ) నియమిస్తూ రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు మంగళవారం పదవీ విరమణ చేయడంతో ఆయన నుంచి డాక్టర్ కంచర్ల సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు. సిద్ధార్థ వైద్య కళాశాలలో దీర్ఘకాలం పాటు పనిచేసిన డాక్టర్ కంచర్ల సుధాకర్ గతంలో కొంత కాలం ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేశారు. ఇక్కడి నుంచి 2019లో గుంటూరు బదిలీపై వెళ్లిన ఆయన అక్కడ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా కూడా కొంతకాలం పనిచేశారు. కోవిడ్ సమయంలో కోవిడ్ కంట్రోల్‌రూమ్‌లో ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యునిగా విశేష సేవలు అందించారు.

తల్లిపై కత్తితో దాడి చేసిన ఎక్సైజ్ కానిస్టేబుల్

వెల్లుర్తిపాడు(పెనుగంచిప్రోలు): ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి తన తల్లిపై కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలోని వెల్లుర్తిపాడు గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చావలి వెంకట్రావమ్మకు నలుగురు సంతానం. వారిలో రెండో వాడైన నాగమల్లేశ్వరరావు జగ్గయ్యపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రాత్రి 8 గంటల సమయంలో తన తల్లి వెంకట్రావమ్మకు పుట్టింటి నుంచి ఆస్తిగా వచ్చిన డబ్బును తనకు పంచమని అడిగాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరగటంతో తనతో తెచ్చుకున్న కత్తితో తల్లిపై దాడి చేశాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు నాగమల్లేశ్వరరావుపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఇంజినీర్ మృతి

పెనమలూరు: కానూరు సిరీస్ వద్ద మంగళవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఇంజినీర్ దుర్మరణం చెందాడు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం ఎన్‌టీపీసీలో చీఫ్ ఇంజినీర్‌గా పని చేసి రిటైర్ అయిన కాట్రగడ్డ రామకృష్ణారావు (81) పప్పులమిల్లు వద్ద యమునా అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. అతనికి భార్య పార్వతీ ఉండగా ఇద్దరు పిల్లలు విదేశాల్లో ఉన్నారు. కాగా రామకృష్ణారావు ప్రతిరోజు ఉదయం 4 గంటలకు వాకింగ్‌కు వెళ్తాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కానూరు సిరీస్ వెనక రోడ్డులో వాకింగ్ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఆయనను ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో రామకృష్ణారావుకు తీవ్ర గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.